
సాక్షి అనంతపురం

శుక్రవారం । 25 । జూలై । 2025



టన్ను చీనీ రూ.17 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.34

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ. 34, కనిష్టంగా రూ.17, సరాసరిన రూ.25 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.4°/22.6°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

యర్రగుంటపల్లిలో సినీ హీరో శ్రీకాంత్ సందడి



హీరో శ్రీకాంత్‌తో గ్రామస్తులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండలంలోని యర్రగుంట పల్లిలో సినీ హీరో శ్రీకాంత్, ఊహ దంపతులు సందడి చేశారు. గ్రామంలో కొలువైన చౌడేశ్వరీ మాత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు శ్రీకాంత్ దంపతులు విచ్చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకున్నారు. శ్రీకాంత్‌తో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. అంతకుముందు ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో శ్రీకాంత్, ఊహ దంపతులు పాల్గొన్నారు. అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

క్రేజీ కంప్యూటర్ సైన్సెస్

- ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో సింహభాగం విద్యార్థుల మొగ్గు

అనంతపురం: ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీసెట్ (ఎంపీసీ స్ట్రీమ్) తొలి దశ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు పూర్తయింది. కంప్యూటర్ ఆధారిత కోర్సులపైనే సింహభాగం విద్యార్థులు ఆసక్తి చూపించారు. జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్, ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలల్లో కంప్యూటర్ సైన్సెస్ సీట్లు (స్పోర్ట్స్, ఎన్‌సీసీ కోటా మినహా) అన్నీ భర్తీ అయ్యాయి. సీట్లు భర్తీ అయిన ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎస్ఆర్ఐటీ, అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలు టాప్-2లో ఉన్నాయి. ఎస్ఆర్ఐటీలో ఈసీఈ142, సీఎస్ఈ 284, మెషీన్ లర్నింగ్ 142, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్సెస్ 142 సీట్లు అన్ని బ్రాంచులు కలిపి 828 సీట్లు భర్తీ అయ్యాయి.అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ-218, సీఎస్ఈ-427, మెషీన్ లర్నింగ్ 220, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ 48, డేటా సైన్సెస్ 47 మొత్తం అన్ని బ్రాంచులు కలిపి 990 సీట్లు భర్తీ అయ్యాయి.ఈ నెల 26లోపు కళాశాలల్లో విద్యార్థులు రిపోర్ట్ చేయాల్సి ఉంది. ఆగస్టు 4 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

జీడిపల్లి రిజర్వాయర్‌కు చేరిన కృష్ణా జలాలు


బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా జలాల చేరిక ప్రారంభమైంది. గురువారం స్థానిక రిజర్వాయర్ హెడ్ రెగ్యులేటరీ వద్ద హంద్రీ-నీవా సీఈ నాగరాజ, ఎస్ఈ రాజ స్వరూప్‌కుమార్, ఈఈ శ్రీనివాసులు, డీఈఈ రామసుబ్బయ్య స్థానికులతో కలిసి కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీర, సారెను కృష్ణమ్మకు సమర్పించారు. కర్నూలు జిల్లాలోని మల్యాల నుంచి 'అనంత వెంకటరెడ్డి హంద్రీ-నీవా సుజల స్రవంతి' ప్రాజెక్టు కాలువలకు కృష్ణా జలాల పంపింగ్ ఈనెల 17న ప్రారంభించారు. ఇటీవల జిల్లాలోని రాగులపాడుకు జలాలు చేరుకున్నాయి. అక్కడి ఎనిమిదో నంబర్ పంపు హౌస్ నుంచి కృష్ణా జలాలను ఎత్తిపోయడం బుధవారం ప్రారంభించారు. ఈ క్రమంలోనే నీరు జీడిపల్లి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతున్నాయి. ప్రస్తుతం రాగులపాడు వద్ద నాలుగు పంపుల ద్వారా 1,100 క్యూసెక్కుల నీరు ఎత్తిపోస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



కటాక్షించు చౌడేశ్వరీ మాతా

జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన ఉరగాద్రి చౌడేశ్వరీ అమ్మవారి జయంత్యుత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చౌడేశ్వరీ మాత దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. కటాక్షించు తల్లీ అంటూ వేడుకున్నారు. – ఉరవకొండ

అధికారంలో ఉన్నాం... తమకు ఎదురు లేదనుకున్నాడో ఏమో ఓ పచ్చ నేత బరితెగించాడు.ప్రభుత్వ భూమిని కొట్టేసేందుకు పన్నాగం పన్నాడు. సెంటు, రెండు సెంట్లు కాదు ఏకంగా రూ. 5 కోట్లకు పైగా విలువ చేసే 3.80 ఎకరాలను కబ్జా చేసేందుకు యత్నించాడు. మొన్నటిదాకా ఎలాంటి అనుమతులు లేకుండా, ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యుల పేరు చెప్పుకుంటూ ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలించి 'క్యాష్' చేసుకున్న ఈయన... తాజాగా ప్రభుత్వ భూమిపై కన్నేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



జగనన్నకాలనీకి కేటాయించిన భూమిని అక్రమంగా చదును చేసిన దృశ్యం

ప్రభుత్వ భూమిపై పచ్చగద్ద

- రూ. 5 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమిపై టీడీపీ నేత కన్ను
- గత ప్రభుత్వంలో జగనన్న కాలనీకి కేటాయించిన భూమి కబ్జాకు యత్నం
- నాలుగు రోజుల క్రితం ట్రాక్టర్‌తో దున్నుతుండగా అధికారుల అడ్డగింత
- భూమిలోకి అడుగుపెడితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరిక



కృష్ణంరెడ్డిపల్లి సమీపంలో చదును చేస్తున్న భూమిని అడ్డుకుని విచారిస్తున్న తహసీల్దార్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని కందుకూరు పొలం 90-3 సర్వే నంబరులో 3.86 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో తహసీల్దార్ కార్యాలయంలో పని చేసిన ఓ అధికారి తన బినామీ పేరుతో 3.86 ఎకరాలకు నకిలీ 'మిల్ట్రీ' పట్టా తయారు చేయించి రికార్డుల్లోకి ఎక్కించాడు. ఎవరి పేరుమీద పట్టా ఉందో ఆ వ్యక్తి ఇప్పటిదాకా తహసీల్దార్ కార్యాలయానికి కానీ, ఈ భూమివైపు కానీ తొంగి చూడలేదు. దీంతో పట్టా రద్దుకు గత ప్రభుత్వంలో సిఫార్సు చేశారు. అలాగే, కృష్ణంరెడ్డిపల్లికి చెందిన పేదలకు ఇంటి పట్టాల కోసం ఈ భూమిలో ఎకరన్నర భూమిని 'జగనన్న కాలనీ'కి కేటాయించారు. 48 మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించేలా స్కెచ్ కూడా తయారు చేశారు. లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు తయారు చేసే క్రమంలో ఎన్నికలు రావడంతో ప్రక్రియ ఆగిపోయింది.

కూటమి ప్రభుత్వంలో పచ్చ నేత కన్ను..

ప్రభుత్వం మారగానే కృష్ణంరెడ్డిపల్లికి చెందిన ఓ చోటా నేత ఈ భూమిపై కన్నేసి కబ్జా చేసేందుకు పూనుకున్నాడు. నాలుగు రోజుల క్రితం ట్రాక్టర్‌తో దున్ని చదునుచేసేందుకు వెళ్లాడు. ట్రాక్టర్‌తో అర ఎకరా వరకు దున్నాడు. ఇంతలో సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వెళ్లి అడ్డుకున్నారు. భూమి తమదేనంటూ పచ్చ నేత బుకాయించే ప్రయత్నం చేశాడు. అధికారులు తిరగబడడంతో మెత్తబడ్డాడు. ఇది పూర్తిగా ప్రభుత్వ భూమి, ఎవరైనా అక్రమంగా ప్రవేశిస్తే సీరియస్‌గా పరిగణిస్తామని హెచ్చరించారు.

కుప్పలుగా నకిలీ పట్టాలు..

గతంలో కొందరు రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి 'మిల్ట్రీ' పట్టాల పేరుతో పెద్ద ఎత్తున దందా చేశారు. 'మిల్ట్రీ' పట్టాల పంపిణీలో కనీస నిబంధనలు పాటించలేదు. ఎవరో ఒకరిమీద.. అదికూడా పదేళ్ల కిందటే మిల్ట్రీ పట్టా పుట్టించి వాటిని రికార్డుల్లోకి ఎక్కించేందుకు కొందరు బాగా సహకరించారు.పదేళ్లు పూర్తికావడంతో వారి నుంచి మరొకరు కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని అమ్మకాలకు తెర తీశారు. ఈ ముసుగులో కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట, ఉప్పరపల్లి, కందుకూరు, కొడిమి, ఎ.నారాయణపురం సర్వే నంబర్లలో నకిలీ పట్టాదారులు ఎక్కువగా ఉన్నారు. మాజీ సైనికులకు ప్రభుత్వ భూమి కేటాయించాలంటే ముందుగా సైనిక సంక్షేమశాఖ నుంచి పేర్లు కలెక్టర్‌కు సిఫార్సు చేయాలి. కలెక్టర్ పరిశీలించి సంబంధిత మండలాల తహసీల్దార్లను ఆదేశిస్తారు. వారు తమ పరిధిలో ప్రభుత్వ భూములను గుర్తించి తిరిగి కలెక్టర్‌కు.. అక్కడి నుంచి సైనిక సంక్షేమశాఖ అధికారులకు పంపుతారు. ఆ తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు భూములను అర్హులైన మాజీ సైనికులకు 'అసైన్డ్' చేస్తారు. అయితే ఈ ప్రక్రియ ఎక్కడా లేకుండానే కొందరు ఘనులు పట్టాలిచ్చారు. 'మిల్ట్రీ' పట్టా భూములపై లోతుగా విచారణ జరిపితే అక్రమాలు కోకొల్లలుగా వెలుగులోకి వస్తాయని స్వయంగా రెవెన్యూ అధికారులు చెబుతుండడం గమనార్హం.

ఉరవకొండలో బరితెగింపు

ఉరవకొండ: అధికార అండ చూసుకుని తమ్ముళ్లు బరి తెగిస్తున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. ఉరవకొండ పట్టణంలో రూ.లక్షలు విలువ చేసే 20 సెంట్ల ప్రభుత్వ భూమిలో రాత్రికే రాత్రే జేసీబీల సాయంతో చదును చేసి పసుపు రంగు రాళ్లు పాతడం చర్చనీయాంశంగా మారింది. వివరాలు.. ఉరవకొండ శివరామిరెడ్డి కాలనీలోని సర్వే నం. 552లో 2023లో పేదలకు పట్టాలు ఇచ్చారు. ఇంకా కొంత స్థలం ఖాళీగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక టీడీపీ నాయకులు ఈ స్థలంపై కన్నేశారు. నకిలీ పట్టాలు సృష్టించుకుని ఇటీవల అందులోకి చొరబడ్డారు. హద్దుల రాళ్లు పాతి వాటికి పసుపు రంగు కొట్టారు. గతంలో ఉరవ కొండ పట్టణానికి చెందిన ఓ ప్రయివేట్ సర్వేయర్ సాయంతో నకిలీ పట్టాలు సృష్టించినట్లు తెలుస్తోంది. గతంలో శివరామిరెడ్డి కాలనీలోనే సదరు సర్వేయర్ అనేక నకిలీ పట్టాలు తయారు చేసి లక్షలాది రూపాయలు దోచుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.



ప్రభుత్వ భూమిని చదును చేసి పసుపు రాళ్లు పాతిన టీడీపీ నేతలు

ఆయనకు ఏమాత్రం సంబంధం లేదు

కృష్ణంరెడ్డిపల్లి సమీపంలో 90-3 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నారనే సమాచారంతో వెళ్లి పరిశీలించాం. అది పూర్తిగా ప్రభుత్వ భూమే. చదును చేస్తున్న వ్యక్తికి, ఆ భూమికి ఏమాత్రం సంబంధం లేదు. వెంటనే ట్రాక్టర్ తీసుకుని భూమిలో నుంచి బయటకు పంపించాం. ఫారం-1,2 నోటీసులు జారీ చేశాం. మళ్లీ భూమిలో కనిపిస్తే ట్రాక్టర్‌ను సీజ్ చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయిస్తాం.

– మోహన్‌కుమార్, తహసీల్దార్, అనంతపురం రూరల్ మండలం

తేలికపాటితో సరి!

అనంతపురం అగ్రికల్చర్: ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసేలా కనిపిస్తున్నా వరుణుడు మాత్రం తేలికపాటితోనే సరిపెడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. గుత్తి, గుంతకల్లు, యాడికి, బెళుగుప్ప, యల్లనూరు, వజ్రకరూరు, కుందుర్పి మండలాల్లో మాత్రమే 20 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. రోజంతా మేఘాలు ఆవరిస్తున్నా ఎక్కడా పదును వర్షం కురవకపోవడంతో రైతుల పరిస్థితి దారుణంగా మారింది. ఇప్పటికే ప్రధాన పంటల సాగుకు సమయం చివరి దశకు చేరుకుంది. సాధారణ సాగు 3.39 లక్షల హెక్టార్లకు గానూ ఇప్పటి వరకు 75 నుంచి 80 వేల హెక్టార్లలో మాత్రమే సాగులోకి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఈనెలాఖరులోగా వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, కొర్ర, సజ్జ పంటలు విత్తుకోవాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. కనీసం 20 మి.మీ వర్షపాతం నమోదైతే పంటలు విత్తుకునేందుకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. నీటి వసతి కింద సాగు చేసిన వేరుశనగ, అక్కడక్కడా తేలికపాటి వర్షాలకు సాగు చేసిన ఇతర పంటలకు చీడపీడలు ఆశించినందున సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

నెలాఖరు వరకు ప్రీమియం చెల్లింపునకు అవకాశం

అనంతపురం అగ్రికల్చర్: వాతావరణ బీమా పథకం కింద ప్రీమియం చెల్లింపు గడువు ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, పంటల సాగును దృష్టిలో ఉంచుకుని గడువు పొడిగించారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకుని ప్రీమియం చెల్లించాలని సూచించారు. వేరుశనగ ఎకరాకు రూ.640, పత్తి రూ.1,140, దానిమ్మ రూ.3,750, బత్తాయి, చీనీ రూ.2,750, టమాట రూ.1,600, అరటి రూ.3 వేల ప్రకారం చెల్లించాలని తెలిపారు. అలాగే ఫసల్‌బీమా కింద గుర్తించిన కంది, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరప పంటలకు కూడా ప్రీమియం గడువు నెలాఖరు వరకు ఉందని పేర్కొన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ బాబు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు 'అనంత'



అనంతకు సమస్యలు వివరిస్తున్న వృద్ధులు రత్నమ్మ, మెహరూన్, సాలమ్మ, బీబీజాన్

అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వం ఏర్పాటై 13 నెలలు గడుస్తున్నా పథకాలను సీఎం చంద్రబాబు పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. ఇది ముమ్మాటికీ దగా ప్రభుత్వం. డైవర్షన్ పాలిటిక్స్, కక్ష సాధింపు చర్యలకు మాత్రమే చంద్రబాబు పరిమితమయ్యారు. పీ-4 అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. మోసానికి బ్రాండ్ అంబాసిడర్ బాబు' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం అనంతపురం నగరంలోని 8వ డివిజన్‌లో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కూటమి మేనిఫెస్టోను వివరిస్తూ ఏడాదిగా ప్రజలకు ఎంత మేరకు నష్టం జరిగిందో క్యూ ఆర్ కోడ్ సాయంతో ప్రజలకు 'అనంత' వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, వృద్ధులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో కూటమి ప్రభుత్వం తమను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్‌లో బియ్యం తూకం సరిగా ఇవ్వడం లేదంటూ వాపోయారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందన్నారు. 'తల్లికి వందనం' పథకానికి 85 లక్షల మందికి అర్హత ఉంటే 65 లక్షల మందికి ఇస్తామని చెప్పారని, అందులోనూ ఇంకా లక్షల మందికి వర్తింపజేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ పోరాటం కారణంగానే పథకం అమలు చేశారన్నారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలంటూ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం దారుణమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేయాల్సిందేనని, లేకుంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం మెడలు వంచైనా ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు వెన్నం శివరామిరెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, రాజారెడ్డి, రాజగోపాల్, లక్ష్మణ్ణ, తనీష, సాకే శ్రీనివాసులు, దేవి, రవి, కార్పొరేటర్లు సుమతి, లక్ష్మి, దేవి, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే అన్నీ పాయే

జగన్ సీఎంగా ఉన్నప్పుడు అన్నీ ఇంటి వద్దకే వచ్చేవి. వలంటీర్లు ఉదయాన్నే పింఛన్ ఇచ్చేవారు. పథకాల గురించి ఎప్పటికప్పుడు చెప్పేవారు. సచివాలయాల్లో పని చేసే సిబ్బంది బాగా స్పందించేవారు. ఇంటికి పెద్ద కొడుకులా జగన్ అన్నీ చేసేవాడయ్యా. రైతు భరోసా ఇప్పటికి రెండు సార్లు పడేది. జగన్ ప్రభుత్వం పాయె.. పథకాలన్నీ పాయె. బ్యాంకుల చుట్టూ తిరగలేకపోతున్నాం. ఇంతకన్నా దారుణం ఎక్కడుంటుంది. గతంలో రేషన్ వాహనాల్లో ఇంటి వద్దకే వచ్చి అడిగి మరీ సరుకులు ఇచ్చేవాళ్లు. ఇప్పుడు స్టోర్లు వచ్చాయి. రెండు కిలోమీటర్లు నడిచి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. మాకు నెలకు ఒక్కొక్కరికి 5 కేజీలు ఇవ్వాల్సి ఉంటే అందులో కేజీ కోత విధించి 4 కేజీలు మాత్రమే ఇస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే రేషన్ డీలర్లు దౌర్జన్యం చేస్తున్నారు.

– 'అనంత'తో వృద్ధులు రత్నమ్మ, మెహరూన్‌బీ, సాలమ్మ, బీబీజాన్

ఎంఐజీలకు భూసేకరణ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: ఎంఐజీ లే అవుట్లకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అహుడా అధికారులను ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహుడా ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెనుకొండ, ధర్మవరం, మడకశిర, గుత్తి, కూడేరు, కోడూరు, కందుకూరు ప్రాంతాల్లో లే అవుట్ల అభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. లే అవుట్ల కోసం గుర్తించే భూముల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నివాసయోగ్యమై ఉండి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అనువుగా ఉండాలన్నారు. నగర, పట్టణ కేంద్రాలకు దగ్గరగా ఉండి అభివృద్ధి చేసేందుకు వీలుగా ఉన్న భూములను ఎంపిక చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. లే అవుట్లలో రోడ్లు, కాలువలు, ఇతర ప్రాథమిక సదుపాయాలతో ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.సమావేశంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఈఈ దుష్యంత్, తదితరులు పాల్గొన్నారు.

పెన్నాలో 1,800 ఎకరాల దురాక్రమణ

తాడిపత్రి రూరల్: మండలంలో పెన్నానదిలో 1,800 ఎకరాల మేర ఆక్రమణకు గురైందని తహసీల్దార్ సోమశేఖర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ శివరామక్రిష్ణతో పాటు మండల ప్రజా పరిషత్, మైనర్ ఇరిగేషన్, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం కలెక్టర్‌తో పెన్నానది పరివాహక ప్రాంతంలోని ఆక్రమణలపై చర్చ జరిగిందన్నారు. ఆక్రమణల కారణంగా భవిష్యత్తులో తాడిపత్రి మునిసిపాలిటీతో పాటు పరిసర గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. ఆక్రమణలకు సంబంధించి లోకాయుక్తలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ప్రత్యేకంగా సమావేశమయ్యామని ఆయన తెలిపారు.

ఏసీబీ వలలో దుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్



ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి

అనంతపురం/కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ నారాయణ స్వామి ఏసీబీ వలకు చిక్కారు. గురువారం రాత్రి అనంతపురం నగరంలోని రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ పట్టుబట్టారు. కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న నారాయణస్వామికి ఇటీవల ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. కొన్ని రోజుల క్రితం కళ్యాణదుర్గం మండలం నుసికొట్టాల గ్రామానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి నాగేంద్ర నాయక్ కళ్యాణదుర్గంలో 1.5 ఎకరాలకు సంబంధించి రిజిస్ట్రేషన్, ల్యాండ్ కన్వర్షన్ నిమిత్తం కార్యాలయానికి వెళ్లగా రూ.7 లక్షలు ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్ డిమాండ్ చేశారు. చివరకు రూ.5 లక్షలకు ఒప్పుకున్నారు. ఈ క్రమంలోనే నాగేంద్రనాయక్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. గురువారం రాత్రి డబ్బు ముట్టజెప్పేందుకు అనంత పురం రామ్ నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు రావాలని కోరాడు. నారాయణస్వామి డబ్బు తీసుకుంటుండగా, అప్పటికే కాపుకాసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. డాక్యుమెంటేషన్ పరిశీలనకు కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్లారు.

చర్చనీయాంశం..

కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నారాయణ స్వామిని అటు కార్యాలయంలోనూ, ఇటు అధికార టీడీపీలోని ఓ వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. అధికార టీడీపీలో కేవలం ఒక వర్గానికి మాత్రమే అనుకూలంగా ఉంటున్నారన్న కారణంతో పలుమార్లు నారాయణ స్వామిపై టీడీపీలోని మరో వర్గం జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసింది. ఇటీవల రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ఈ-స్టాంప్ కుంభకోణంలో సైతం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి పాత్ర ఉన్నట్లు టీడీపీలోని ఓ వర్గం ఆరోపించింది. కంబదూరు, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండలాల తహసీల్దార్ల సంతకాల ఫోర్జరీ, భూ బదలాయింపుపై కూడా ఆరోపణలు వినిపించాయి. అలాగే, జిల్లాకు చెందిన కీలక మంత్రి భూమి విషయంలో నారాయణస్వామిపై కన్నెర్ర చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన ఏసీబీ వలలో పడడం చర్చనీయాంశమైంది.

ఆగని 'తెలుగు తమ్ముళ్ల' ఇసుక దందా





పెన్నానదిలో జేసీబీతో ఇసుక తవ్వి ట్రాక్టర్లలో నింపుతున్న దృశ్యం, ఉల్లికల్లులో అక్రమంగా డంపు చేసిన ఇసుక

శింగనమల: టీడీపీ నాయకుల ఇసుక దందా ఆగడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి యథేచ్ఛగా ప్రకృతి వనరును కొల్లగొడుతున్నారు. ఇప్పటికే శింగనమల మండలంలోని పెరవలి, పి.జలాలపురం, చీలేపల్లి, సలకంచెరువు, రాచేపల్లి, నిదనవాడ, తరిమెల, కల్లుమడి గ్రామాల నుంచి ఇసుక తరలించేశారు. తాజాగా చాగల్లు రిజర్వాయర్‌లో బ్యాక్ వాటర్ తగ్గిపోవడంతో ఇసుకను కొల్లగొట్టడం ప్రారంభించారు. నెల రోజుల నుంచి యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. పెన్నా నదిలో జేసీబీ ద్వారా ఇసుకను ట్రాక్టర్లలో నింపి సమీపంలోని తోటలో డంప్ చేస్తున్నారు. రాత్రిళ్లు వేరే ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 'పచ్చ' నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తుండడంతో భూగర్భజలం తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

తాడిపత్రిటౌన్: ఈ నెల 14న తాడిపత్రిలోని కృష్ణాపురం 4వరోడ్డుకు చెందిన హర్ష అలియాస్ హరీష్ కాల్వగడ్డ వీధిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో గాండ్లపాడు అజయ్, మెట్లా దీపక్, గూడూరు హేమంత్‌కుమార్, అల్లుదుర్గా నవీన్, రమాగణేష్, బోసి వెంకట పరమేష్ గురువారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సాయిప్రసాద్ వెల్లడించారు.

తాళాలు తీసి.. క్రేన్ తెచ్చి!

- రూ.40 లక్షలు విలువ చేసే రెండు విద్యుత్ మోటార్ల అపహరణ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మున్సిపల్ ఇంజినీర్లు
- ఇంటి దొంగలపైనే అనుమానం?

గుంతకల్లు మున్సిపల్ వాటర్ పంప్‌హౌస్‌లో సుమారు నాలుగు టన్నుల బరువు కలిగిన 240 హెచ్‌పీ, ఒక టన్ను బరువు ఉన్న 75 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మరో విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. వీటి విలువ సుమారు రూ.40 లక్షలని తెలుస్తోంది. విషయం వెలుగు చూడగానే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కరువైందని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

గుంతకల్లు టౌన్: పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు గుంతకల్లు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. వీటిని హంద్రీ–నీవా కెనాల్ ద్వారా కృష్ణా జలాలతో నింపుతారు. ఇందుకుగాను కృష్ణా జలాలను పంపింగ్ చేయడానికి స్టాండ్‌బైగా ఏర్పాటు చేసిన 240 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన విద్యుత్ మోటార్‌తో పాటు పంప్‌హౌస్ వెనకాల ఓ రేకులషెడ్‌లో ఏర్పాటు చేసిన 75 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన విద్యుత్ మోటార్‌ను రెండు రోజుల క్రితం దుండగులు అపహరించారు. హంద్రీ–నీవాకు కృష్ణాజలాలను విడుదల కావడంతో ఆ నీటిని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లకు పంపింగ్ చేసేందుకు ఆనవాయితీగా నిర్వహిస్తున్న గంగ పూజ చేసేందుకు బుధవారం ఉదయం మున్సిపల్ వాటర్ వర్క్స్ సిబ్బంది పంప్‌హౌస్ తాళాలను తెరిచి చూడగా విద్యుత్ మోటార్లు కనిపించలేదు. విషయం తెలుసుకున్న గుంతకల్లు మున్సిపల్ ఈఈ ఇంతియాజ్, డీఈ షబానా అక్కడికెళ్లి పరిశీలించారు. ఘటనపై గుంతకల్లు వన్‌టౌన్ పీఎస్‌లో ఇంజినీరింగ్ అధికారులు ఫిర్యాదు చేయడంతో గురువారం అనంతపురం నుంచి వచ్చిన క్లూస్‌టీమ్‌తో పంప్‌హౌస్‌ను పోలీసులు పరిశీలించి నిందితుల వేలి ముద్రల కోసం అన్వేషించారు. విద్యుత్ మోటార్ల చోరీకి సంబంధించి ఫిర్యాదు చేశారని, సవివరంగా రాసిస్తే కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని సీఐ మనోహర్ వెల్లడించారు.

పక్కా ప్లాన్ ప్రకారమే..

మున్సిపల్ వాటర్ పంప్‌హౌస్‌లో జరిగిన చోరీని గమనిస్తే పక్కా ప్రణాళికా ప్రకారమే జరిగిందనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. పంప్‌హౌస్‌కు వేసిన తాళాలేవీ పగులగొట్టకుండా తెరిచి ఉన్నాయి. మోటార్లను అపహరించిన తర్వాత యథావిధిగా తాళాలను వేశారు. దీనిని బట్టి విద్యుత్ మోటార్లను అపహరించిన ముఠాకు ఇంటి దొంగలే తాళాలిచ్చి సహకరించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు టన్నుల బరువు కలిగిన 240 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన విద్యుత్ మోటార్‌ను 10 మంది పైకెత్తలేరని అక్కడ పనిచేసే సిబ్బందినే చెబుతున్నారు. అయితే దుండగులు చాలా చక్కగా స్పానర్లతో మోటార్ బోల్ట్‌లను విప్పి చైన్ బ్లాక్, హెచ్–చానల్‌ను వినియోగించి క్రేన్ సాయంతో విద్యుత్ మోటార్లను లారీల్లో తరలించినట్లుగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించి పంప్‌హౌస్ వద్ద భారీ వాహన టైర్ల ముద్రలు పడి ఉన్నాయి. ప్రస్తుత మార్కెట్‌లో ఈ రెండు కొత్త మోటార్లను కొనుగోలు చేయాలంటే రూ.40 లక్షల వరకు అవుతుందని అధికారులు అంటున్నారు.



75 హెచ్‌పీ మోటారు చోరీకి గురైన దృశ్యం



చోరీ జరిగిన పంప్‌హౌస్ వద్ద భారీ వాహన టైర్ల ముద్రలు

కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న నిర్లక్ష్యం

సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లు, పంప్‌హౌస్‌ల నిర్వహణ విషయంలో సంబంధిత వాటర్ వర్క్స్ ఇంజనీర్, అక్కడ పనిచేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. లక్షలాది రూపాయల విద్యుత్ మోటార్లు కలిగిన పంప్‌హౌస్‌ల వద్ద రాత్రివేళల్లో కనీస భద్రత కూడా కల్పించకపోవడమే ఇందుకు నిదర్శనం. పైగా తొలుత 240 హెచ్‌పీ మోటార్ మాత్రమే చోరీకి గురైందని రాతపూర్వకంగా పోలీసులకు ఇంజనీర్లు ఫిర్యాదు చేశారు. 75 హెచ్‌పీ మోటార్ కూడా చోరీకి గురైందనే విషయాన్ని విలేకర్లు ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలతో కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. అంతేకాక 75 హెచ్‌పీ మోటార్ కూడా కనిపించడం లేదని మౌఖికంగానే పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

> **కఠిన చర్యలు**
>
> విద్యుత్ మోటార్ల చోరీ విషయంలో సిబ్బంది సహకారముందని అనుమానాలు ఉన్నాయి. ఇదే నిజమని పోలీసుల విచారణలో తేలితే.. వారెవరూ గుర్తించి ఉద్యోగం నుంచి తొలగిస్తాం.
>
> – నయీమ్ అహమ్మద్ మున్సిపల్ కమిషనర్, గుంతకల్లు

ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్యమే

పంప్‌హౌస్‌లో విద్యుత్ మోటార్లు చోరీ కావడటమంటే అది ముమ్మాటికీ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమేనని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి ఆరోపించారు. ఈ చోరీపై అనేక అనుమానాలున్నాయని, వెంటనే నిందితులను పట్టుకుని శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం ఉదయం సీపీఎం నాయకులు పంప్‌హౌస్‌ను పరిశీలించారు.

హుండీ ఎటూ పోలేదు



వివరాలు వెల్లడిస్తున్న ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి దేవాలయంలో హుండీ మాయం కాలేదనిఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు గురువారం స్పష్టం చేశారు. ఈ మేరకు వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. హుండీ లెక్కింపు సమయంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీను పరిశీలించామని, కమిటీ సభ్యుల సమక్షంలోనే హుండీ లెక్కింపు జరిగిందని పేర్కొన్నారు. హుండీ ఎటూ పోలేదని తెలిపారు. అయితే అధికారులు వెల్లడించిన అంశాలపై స్పష్టత లేకపోవడంతో అనుమానాలు వీడలేదు. ఏదైతే కనిపించడం లేదనే పసుపు రంగు హుండీ సీసీ కెమెరా ఫుటేజీల్లో లేకపోవడం మిస్టరీగానే మిగిలిందని గ్రామస్తులు అంటున్నారు.

మున్సిపల్ కార్మికుడిపై టీడీపీ నేత దాడి



సీఐటీయూ నేతలతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు సురేష్

రాయదుర్గం టౌన్: స్థానిక మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు సురేష్‌పై టీడీపీ యువ నాయకుడు చిన్నా దాడికి తెగబడ్డాడు. బాధితుడు తెలిపిన మేరకు.. 21వ వార్డు మారమ్మగుడికి వెళ్లే దారిలోని ఓ వీధికి తాగునీటిని అందించేందుకు ప్రైవేటు అద్దె ట్యాంకర్‌ను సురేష్ గురువారం తీసుకెళ్లాడు. ఆ మార్గంలో నివాసముంటున్న చిన్న ఇంటి ఎదుట బైక్ అడ్డుగా ఉండడంతో గమనించిన సురేష్ దారికి అడ్డుగా ఉన్న బైక్‌ను పక్కకు తీయాలని కోరాడు. దీంతో తననే ప్రశ్నిస్తావా అంటూ చెప్పు కాళ్లతో విచక్షణ మరిచి దాడికి పాల్పడ్డాడు. అసభ్యపదజాలంతో దూషణలకు దిగాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు సురేష్‌కు మద్దతుగా నిలిచారు. న్యాయం చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డితోపాటు డీఈ సురేష్, ఏఈ నరసింహులకు విన్నవించారు. అనంతరం సీఐటీయూ నాయకులతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జైళ్లలో సదుపాయాలు సక్రమంగా ఉండాలి

- జిల్లా జడ్జి భీమరావు

ధర్మవరం అర్బన్/పెనుకొండ: సబ్ జైళ్లలో ఖైదీలకు సదుపాయాలు సక్రమంగా ఉండాలని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి భీమరావు అన్నారు. ధర్మవరం, పెనుకొండ సబ్‌జైళ్లను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదులు, ఖైదీలు ఉండే గదులు, సరుకులు నిల్వ ఉంచే గదులతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఖైదీలు నిద్రించే గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ధర్మవరం సబ్‌జైలు సూపరింటెండెంట్ శివప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం ఖైదీలతో సమావేశం నిర్వహించారు. క్షణికావేశంలో చేసే నేరాలతో జీవితం చిన్నాభిన్నం అవుతుందన్నారు. భవిష్యత్తులో నేరాలు చేయకుండా కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని శాంతియుతంగా జీవించాలని సూచించారు. సత్ప్రవర్తనతో మెలిగితే శిక్ష తగ్గింపు కూడా ఉంటుందని తెలిపారు. ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా ఏర్పాటు చేస్తామని సూచించారు. ప్రతినెలా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఖైదీలకు పరీక్షలు నిర్వహించేలా చూడాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జిలు వెంకటేశ్వర్లు, వాసుదేవన్, జడ్జిలు బొజ్జప్ప, రాకేష్, న్యాయవాదులు బిల్లే రవీంద్ర, బాలసుందరి, సుమలత, జైలు సిబ్బంది పాల్గొన్నారు.



పెనుకొండ: సబ్‌జైలును తనిఖీ చేస్తున్న జిల్లా జడ్జి

పశుశాఖ ఇన్‌చార్జ్ జేడీగా బాధ్యతల స్వీకరణకు విముఖత

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జ్ జాయింట్ డైరెక్టర్‌గా అనంతపురం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) డాక్టర్ వై.రమేష్‌రెడ్డిని నియమిస్తూ ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ దామోదర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ బాధ్యతలు తీసుకునేందుకు డీడీ విముఖత వ్యక్తం చేస్తూ డైరెక్టర్‌కు తెలియజేసినట్లు సమాచారం. పశుశాఖ జేడీగా ఉన్న డాక్టర్ జీపీ వెంకటస్వామి గత నెలాఖరున ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఫారిన్ సర్వీసు కింద జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ టీవీ సుధాకర్‌కు ఎఫ్ఏసీ జేడీగా బాధ్యతలు అప్పగించారు. అయితే ఫారిన్ సర్వీసు ముగియడంతో డిపార్ట్‌మెంట్‌లో పోస్టింగ్ కోసం ఆయన పది రోజులుగా సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో జేడీ ఆఫీసులో ఏడీగా ఉన్న డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మికి తాత్కాలిక జేడీగా బాధ్యతలు ఇచ్చారు. ఈ క్రమంలో డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డికి ఇన్‌చార్జ్ జేడీగా నియమించినా ఆయన విముఖత చూపడంతో ఒకట్రెండు రోజుల్లో జేడీ ఎవరనేది తెలుస్తుందని ఆశాఖ వర్గాలు తెలిపాయి.

నలుగురు విద్యార్థుల అదృశ్యం



ఎస్. మణికంఠ



కె. మణికంఠ



పి. బాబు



జి.నవదీప్

అనంతపురం: నగరంలోని మూడో రోడ్డులో ఉన్న బీసీ బాలుర హాస్టల్–2లో ఉంటూ ఒకటో రోడ్డులో ఉన్న పొట్టిశ్రీరాములు ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న నలుగురు విద్యార్థులు కనిపించకుండా పోయారు. వీరిలో పదో తరగతి చదువుతున్న నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామానికి చెందిన బాబు, కూడేరు మండలం అరవకూరు గ్రామానికి చెందిన జి.నవదీప్, 8వ తరగతి చదువుతున్న గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన ఎస్.మణికంఠ, తొమ్మిదో తరగతి చదువుతున్న శ్రీసత్యసాయి జిల్లా తోటమాకులపల్లి గ్రామానికి చెందిన కె.మణికంఠ ఉన్నారు. పాఠశాలకు సక్రమంగా హాజరు కాకపోవడంతో పాటు.. పాఠ్యాంశాలల్లో వెనుకబడి ఉండడంతో గురువారం హెచ్‌ఎం శ్రీదేవి మందలించారు. దీంతో మధ్యాహ్నం పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోయిన విద్యార్థులు ఆ తర్వాత హాస్టల్‌కు చేరలేదు. గమనించిన వార్డెన్ మస్తాన్ వెంటనే అప్రమత్తమై పాఠశాలలో ఆరా తీశాడు. మధ్యాహ్నం నుంచి వారు తరగతులకు హాజరు కాలేదని తెలుసుకుని చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చేపట్టాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో రాత్రి మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు సీఐ కె.శాంతిలాల్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94906 18679కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

వేట కొడవలితో కౌలు రైతుపై దాడి

బెళుగుప్ప: మండలంలోని ఆవులెన్న గ్రామంలో కౌలురైతు ఎస్కే నాగలక్ష్మి, ట్రాక్టర్ డ్రైవర్ అశోక్‌పై అదే గ్రామానికి చెందిన విశ్రాంత పోలీస్ అధికారి కృష్ణకుమార్ వేటకొడవలితో దాడి చేసి గాయపరిచాడు. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామంలోని రైతు యోగేష్‌రెడ్డికి చెందిన పొలాన్ని నాగలక్ష్మి కౌలుకు తీసుకున్నారు. గురువారం ట్రాక్టర్ సాయంతో కంది విత్తేందుకు వెళ్లిన సమయంలో పక్క పొలం యజమాని కృష్ణకుమార్ (రిటైర్డ్ ఏఎస్ఐ) అడ్డుకున్నాడు. కౌలుకు తీసుకున్న భూమిలో తన భాగం కూడా ఉందని వాగ్వాదానికి దిగి వేటకొడవలితో దాడికి తెగబడ్డాడు. ఘటనలో నాగలక్ష్మితో పాటు ట్రాక్టర్ డ్రైవర్ అశోక్ గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

డెయిరీలో జనరేటర్ అపహరణ

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమూల్ పాల వెల్లువ కేంద్రం (మహిళా డెయిరీ)లో జనరేటర్‌తో పాటు 70 పాల క్యాన్లను దుండగులు అపహరించారు. మనుషులు ఎత్తేందుకు సాధ్యంకాని టన్నులకొద్దీ బరువున్న జనరేటర్ మాయం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాచానపల్లి పంచాయతీ పరిధిలో చిరంజీవిరెడ్డి కళాశాల దాటిన తర్వాత ఈ పాల కేంద్రం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దీనిని మూసేశారు. డెయిరీ ఉద్యోగులు అప్పుడప్పుడు పరిశీలించి వెళ్లేవారు. వెనుక వైపు ఏర్పాటు చేసిన జనరేటర్ గది షెట్టర్‌కు వేసిన తాళం తెరిగి జనరేటర్‌ను అపహరించారు. అనంతరం తాళం వేసి వెళ్లారు. దీనిని ఎవరూ గమనించలేదు. అలాగే మరో గదికి వేసిన తాళం పగలకొట్టి 70 పాలక్యాన్లను ఎత్తుకెళ్లారు. మూడు రోజుల క్రితంఅటుగా వెళ్లిన స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో సర్పంచ్ అంజియాదవ్‌తో పాటు భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. పాలడెయిరీ మేనేజర్ నారాయణమ్మ దృష్టికి తీసుకెళ్లారు. రెండురోజుల క్రితం ఆమె వచ్చి పరిశీలించి...రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సీఐ శేఖర్ గురువారం సాయంత్రం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు చేసి దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

క్లుప్తంగా

'నాసా' ప్రాజెక్టులో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తబస్సుమ్, డీన్లు

అనంతపురం ఎడ్యుకేషన్: 'నాసా' మొదటి లెవల్ ప్రాజెక్టులో ప్రతిభ చాటిన స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాల 9వ తరగతి విద్యార్థులను గురువారం ఏజీఎం సుబ్బారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమిపై మనుషులు నివసించడానికి అనువైన వాతావరణం ఉందన్నారు. భవిష్యత్తులో ఏ కారణాల వల్లనైనా మానవాళి మనుగడకు ముప్పు జరిగినప్పుడు మనుషులు విశ్వంలో నివసించడానికి వీలుగా భూ వాతావరణం మాదిరిగా కృత్రిమమైన ఒక స్పేస్ హోటల్, స్పేస్ కాలనీ లాంటి ప్రాజెక్టును విద్యార్థులు తయారు చేయడం అభినందనీయమన్నారు. రెండో లెవల్‌లో ఈ ప్రాజెక్ట్ దేశ వ్యాప్తంగా ఉత్తమంగా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుమ్, డీన్లు సిరాజుద్దీన్, చిరంజీవి, అకడమిక్ కో–ఆర్డినేటర్ ఇర్షాద్ పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడికి నివాళి



అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం: గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలను జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయ ఉద్యమాన్ని నడిపి, గ్రంథాలయాల ప్రాధాన్యత, పుస్తకాల విలువను మానవాళికి చాటి చెప్పిన మహనీయుడు అని కొనియాడారు. ఈ సందర్భంగా అయ్యంకి వెంకట రమణయ్య జీవిత విశేషాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ డి.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి

అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు తాండవిస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయిస్వామి మండిపడ్డారు. గురువారం నగరంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయకపోవడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు చెల్లించడంతో పాటు విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, దోమతెరలు, ప్లేట్లు, గ్లాసులు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మంజునాథ్, సమీర్, సాయితరుణ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాప్తాడు: మండలంలోని యర్రగుంట సమీపంలో ద్విచక్ర వాహనం నుంచి కింద పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామానికి చెందిన గోగుల అరుణమ్మను అనంతపురం రూరల్ మండలంలోని క్రిష్టమరెడ్డి పల్లికి చెందిన గోగుల నారాయణ స్వామి (30)కి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుతూరు, ఒక కుమారుడు ఉన్నారు. గోగుల అరుణమ్మ తల్లికి ఆరోగ్యం బాగా లేకపోతే ఈనెల 21ను ఆమెను చూడడానికి ఎం.బండమీదపల్లికి గ్రామానికి వచ్చింది. ఈనెల 22న రాత్రి గోగుల నారాయణస్వామి కూడా అత్తను చూసేందుకు ద్విచక్ర వాహనంలో క్రిష్టమరెడ్డిపల్లి నుంచి ఎం.బండమీదపల్లికి బయలు దేరాడు. ద్విచక్ర వాహనం మండలంలోని యర్రగుంట సమీపంలోకి రాగానే వీధి కుక్క అకస్మాత్తుగా అడ్డు రావడంతో బ్రేక్ వేయడంతో గోగుల నారాయణ స్వామి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు 108 ద్వారా అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశువులపై ప్లాస్టిక్ ఉరి

అనంతపురం కార్పొరేషన్: ప్లాస్టిక్.. పశువులకు ప్రాణాంతకంగా మారింది. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వైద్య సామగ్రి, పాచిపోయిన అన్నం, తదితర వ్యర్థాలను తిని మృత్యువాత పడుతున్నాయి. నగరంలో వీధి పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. యజమానులు వీటి ఆలనాపాలనా చూడకపోవడంతో రహదారుల పక్కన పడేసిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నాయి. నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారులు, ఆవుల పెంపకందారుల బాధ్యతారాహిత్యం ఆవుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పశు వైద్యులు చెబుతున్నారు. నగరంలోని ప్రధాన రోడ్లతో పాటు మార్కెట్, కంపోస్టు యార్డు, నగరంలో హౌసింగ్ బోర్డు, అరవింద నగర్, జీసస్ నగర్, కమలా నగర్, కృపానంద నగర్, నాయక్ నగర్, ఆదర్శ నగర్, సాయినగర్, 1, 2, 3, 4, 5 రోడ్లు, నీరుగంటి వీధి, రాంనగర్, వేణుగోపాల్ నగర్, పాతూరు, రాణినగర్, వినాయక నగర్, తదితర ప్రాంతాల్లో దాదాపుగా వెయ్యికి పైగా పశువులు తిరుగుతున్నాయి. ఆవులు మన కళ్ల ముందు కనిపించడం శుభప్రదం అనుకున్నా.. ఆవులు తింటున్న ప్లాస్టిక్‌ను చూస్తే ఒళ్లు జలదరిస్తుంది.



సంగమేష్ సర్కిల్‌లో ప్లాస్టిక్, చెత్తను తింటున్న ఆవులు

రోడ్లపై సంచారం

నగరంలోని ప్రధాన రోడ్లలో పశువులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. కొన్ని సార్లు ఒకదానిపై ఒకటి దాడులు చేసుకోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పాఠశాలలు ఉండే ప్రాంతాల్లో పొరపాటున చిన్నారులపై దాడి చేస్తే.. దేవుడే దిక్కు. ఇక ప్రధాన కూడళ్లలోనూ రోడ్డుకు అడ్డంగా రాకపోకలు సాగిస్తున్నాయి. పొరపాటున వాహనదారులకు తగిలితే ప్రమాదాలు జరగడంతో పాటు పశువులు గాయపడే పరిస్థితి లేకపోలేదు. ఆవులను సంరక్షించడంలో పెంపకందారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ఆవులను గోశాలకు తరలించడమే ఉత్తమం అని నగరవాసులు చెబుతున్నారు. గోశాల నిర్వాహకులు ఆవులను దేవుళ్లగా భావించి పశుగ్రాసాన్ని అందిస్తారు. పెంపకందారులు కూడా ఆవులను బయటకు వదలకుండా చూసుకోవాలి. గోవులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు నిద్రమత్తులో ఉన్నారు. ప్రజారోగ్యాధికారితో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ట్రేడ్ లైసెన్స్, తదితర వాటిపై ఉన్న శ్రద్ధ ఆవుల సంరక్షణ, ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే ఇక మిగతా ప్రాంతాల్లో చెప్పాల్సిన పనిలేదు.

చంద్రబాబు పాలనంతా మోసాలే



కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: చంద్రబాబు నాయుడు పాలనంతా అబద్ధాలు, మోసాలే అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. గురువారం అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఏ.నాగిరెడ్డిపల్లిలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు ఏడాది పాలనలో తమకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. కూటమి నాయకుల మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు మాజీ ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి ప్రజలను తీవ్రంగా మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు.. అధికారంలోకి రాగానే ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రైతులకు అన్ని విధాలా అండగా నిలిచామన్నారు. ఏటా క్రమం తప్పకుండా రైతు భరోసా పథకం అమలు చేయడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావస్తున్నా రైతన్నలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. రైతు భరోసా పథకం అమలు చేస్తామంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు రామసుబ్బారెడ్డి, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, నాగిరెడ్డిపల్లి నాగేశ్వర్‌రెడ్డి, మల్లెల వేణుగోపాల్, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం

అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వంపై ఏడాదికే ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి తప్పక బుద్ధి చెబుతాం' అని మేయర్ వసీం పేర్కొన్నారు. గురువారం నగరంలోని 48వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డితో కలసి రీకాల్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్‌తో పాటు 147 హామీలను ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందించారన్నారు.



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మేయర్ వసీం, తదితరులు

ఈ డివిజన్‌లో రూ.2.5 కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి, నాయకులు రంగా, మధు, వెంకటేష్, సురేష్, ప్రదీప్, రఘునందన్, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

రాప్తాడు: జిల్లాలో మలేరియా, డెంగీ, ఫైలేరియా వ్యాధుల నివారణకు మంచి నీటి కుంటల్లో గంబూషియా చేపలు వదులుతున్నామని జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య తెలిపారు. గురువారం మండలంలోని ఎం.బండమీదపల్లి, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో దోమల లార్వాలు వృద్ధి చెందే మంచినీటి కుంటల్లో గంబూషియా చేపలు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి తొట్టెలు, డ్రమ్ములు, వాడి పడేసేసిన టైర్లు, మంచి నీటి కుంటల్లో దోమల లార్వాలు వృద్ధి చెందుతాయన్నారు. దోమకాటుతో మలేరియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. దోమల నియంత్రణకే గంబూషియా చేపలను వదులుతున్నామన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు కుట్టకుండా ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ రాత్రి పూట పడుకునే ముందు వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలన్నారు. దీంతో సీజనల్ వ్యాధులు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మలేరియా సహాయ అధికారి అబ్దుల్ మునాఫ్, సూపర్‌వైజర్లు నూరు బాషా, శ్రీధర్ మూర్తి, వైద్యాధికారి శివ కృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నీటి కుంటలో గంబూషియా చేపలను వదులుతున్న జిల్లా మలేరియా అధికారులు

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరీ దేవి జయంతి

- పదో తరగతి విద్యార్థులకు పురస్కారాల ప్రదానం

అనంతపురం కల్చరల్: చౌడేశ్వరీ మాత జయంతి వేడుకలు గురువారం కనుల పండువగా జరిగాయి. ఉదయం నుంచే నగరంలోని గుత్తి రోడ్డులో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో సందడి నెలకొంది. వందలాది మంది మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా విశేష అలంకార సేవలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. విజయ నగర కాలనీలోని శ్రీచౌడేశ్వరీ కల్యాణ భవన్ వేదికగా అమ్మవారి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, కమిటీ అధ్యక్షుడు దాసరి శ్రీధర్, ఉపాధ్యక్షులు బంధనాదం ఆంజనేయులు, రామాంజప్ప, ప్రధాన కార్యదర్శి చింతా వేంకటేశ్వర్లు, చిదంబరయ్య, శేషయ్య, రూప ఉమా మహేశ్వర్, కె.గోపికృష్ణ పాల్గొన్నారు. మొదటి రోడ్డు, తాడిపత్రి బస్టాండ్ తదితర చోట్ల చౌడేశ్వరీ జయంతిని దేవాంగులు జరుపుకున్నారు.



మాట్లాడుతున్న నిర్వాహకులు

రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోండి

అనంతపురం: ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు అడ్డదారిలో అరియర్స్ పొందేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. వెంటనే అరియర్స్‌ను నిలుపుదల చేసి రిజిస్ట్రార్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితకు వినతిపత్రం అందజేశారు. నాన్ టీచింగ్ కేటగిరీలో ఉన్న రీసెర్చ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టును టీచింగ్ కేటగిరీలో చేర్చి అధికంగా అరియర్స్‌ను పొందేందుకు రిజిస్ట్రార్ ఎత్తుగడ వేశారని తెలిపారు. రిజిస్ట్రార్ హోదాలో అక్రమాలకు తెరతీస్తూ.. అధికంగా సొమ్ము తీసుకునే పన్నాగాన్ని అరికట్టాలని కోరారు. గతంలో నియామకం చేసిన కమిటీ సైతం రీసెర్చ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టు నాన్ టీచింగ్ కేటగిరీ కిందకు వస్తుందని సిఫార్సు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కమిటీ సిఫార్సులను సైతం తుంగలో తొక్కి అరియర్స్‌ను అక్రమంగా పొందేందుకు రిజిస్ట్రార్ కుట్రపన్నారని విమర్శించారు. తక్షణమే అరియర్స్ చెల్లింపు ఆపాలని.. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు చిగండి రమేష్, బల్లిబోయిన సురేష్, రవీంద్ర పోలా, ప్రదీప్ కుమార్, మోతే కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ వీసీ అనితకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

ఆస్పత్రి కంపు.. కంపు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. రేడియాలజీ విభాగం సమీపంలో వైద్య విద్యార్థులకు శిక్షణ ఇచ్చే గదుల ముందు ఖాళీ స్థలంలో రోగులకు వినియోగించిన వస్తువులు, చెత్తను యథేచ్ఛగా పడేస్తున్నారు. అక్కడే రోగుల సహాయకులు, ఆస్పత్రి సిబ్బంది ఆరు బయట మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో ఎంఆర్ఐ స్కాన్‌లోని హెచ్ఓడీ రూం పరిసరాలు దుర్వాసన వస్తున్నాయి. ఎప్పటికప్పుడు చెత్తను తరలించడంలో ఆస్పత్రి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా ఆస్పత్రి అధికారులు స్పందించి చెత్తను తరలించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



సర్వజనాస్పత్రిలోని రేడియాలజీ ముందు పేరుకుపోయిన చెత్త

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

- సీటీఐఓ లక్ష్మానాయక్

అనంతపురం అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాచురల్ ఫార్మింగ్ (ఎన్ఎఫ్) చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ (సీటీఐఓ) వి.లక్ష్మానాయక్ అన్నారు. స్థానిక జెడ్‌బీఎన్ఎఫ్ కార్యాలయంలో రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన డీపీఎంయూ సిబ్బందికి 8 రోజుల వర్క్‌షాపు గురువారం ప్రారంభమైంది. నేలలు, రకాలు, ఆగ్రో క్లైమేటిక్ జోన్స్, జలవనరులు, ప్రాజెక్టులు, రైతుల అవసరాలు, ప్రకృతి వ్యవసాయ ఆవిష్కరణలు, ఏటీఎం, ఏ–గ్రేడు, పీఎండీఎస్, డాక్టర్ పీఎం, రుతుపవనాలు, వర్షపాతం, తేమశాతం, నేలల్లో తేమ సంరక్షణా విధానం, మానవులు, పశువుల మధ్య వ్యవసాయ సంబంధాలు తదితర అంశాలపై ఈనెల 24 వరకు వర్క్‌షాపు ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా లక్ష్మానాయక్ మాట్లాడారు. సాధ్యమైనంత ఎక్కువ మంది రైతులను ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. విచ్చలవిడి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వల్ల అధిక పెట్టుబడులు, తగ్గుతున్న దిగుబడులు కారణంగా రైతులకు వ్యవసాయం భారమవుతున్న తరుణంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించడమే శరణ్యమన్నారు. ఏడాది పొడవునా పంటలు పండించే పద్ధతులు తెలియజేయాలన్నారు.

సూక్ష్మ సేద్యపు పరికరాలతో అధిక దిగుబడి

- ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి

ఆత్మకూరు: సూక్ష్మ సేద్యపు పరికరాలతో పంటల సాగు చేపడితే మేలైన దిగుబడులు సాధించవచ్చని రైతులకు ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి సూచించారు. ఆత్మకూరు సమీపంలోని రైతు బందూక జనార్దన్ పొలంలో 90 శాతం సబ్సిడీతో అమర్చిన బిందు సేద్యం పరికరాలను గురువారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. డ్రిప్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నీటి పొదుపుతో పాటు కలుపు నివారణ, మేలైన దిగుబడుల సాధనకు బిందు సేద్యం ఎంతో దోహదపడుతోందని రైతు జనార్దన్ అన్నారు. ఉన్న కొద్ది పాటి నీటితోనే కూరగాయల పంటల సాగు చేపట్టినట్లు వివరించారు. డ్రిప్ ద్వారా చెట్టుకు అవసరమైన ఎరువును అందించే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఏపీడీ ధనుంజయ, ఎంఐఏఓ మల్లేష్, కెప్టెన్ కంపెనీ ఎఫ్‌సీఓ పులగూరు ఓబుళరెడ్డి, బాలు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

జాషువా సాహిత్యం చిరస్మరణీయం

అనంతపురం కల్చరల్: నవయుగ వైతాళికుడిగా సమసమాజ నిర్మాణం జరగాలని కృషి చేసిన మహాకవి జాషువా ఆదర్శప్రాయుడని మేయర్ వసీం కొనియాడారు. గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా గురువారం నగరంలోని జాషువా విగ్రహానికి పలువురు రచయితలు, కళాకారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జాషువా సాహిత్య పీఠం నాగలింగయ్య ఆధ్వర్యంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఆర్టీటీ చైర్మన్ తిప్పేస్వామి తదితరులు జాషువా సేవలను గుర్తు చేసుకున్నారు. జాషువా సాహిత్యం విశ్వజనీనమైనదని, పామర పండితులకు సరళంగా అర్థమయ్యే భాషలో రాసిన కవులు అరుదుగా ఉంటారన్నారు. ఆయన రాసిన గబ్బిలం, ఫిరదౌసి, బాపూజీ, కాందిశీకుడు మొదలైన కావ్యాలు వేటికవే తెలుగు సాహిత్య గొప్పతనాన్ని జాతీయస్థాయిలో చాటాయన్నారు. వర్గ సమాజం పోవాలని కుల రహిత సమాజం కోసం పాటుపడిన జాషువా సాహిత్యాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, టీవీరెడ్డి, మల్లికార్జున, హరి, విశాలాంధ్ర మాజీ మేనేజర్ చెట్ల ఈరన్న, రియాజుద్దీన్, రామచంద్ర, బీసీ లక్ష్మణ, అశ్వర్థరెడ్డి, శంకర్, ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ, జూటూరు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం, తదితరులు

గుండెపోటుతో హోంగార్డు మృతి



పెద్దన్న మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి

అనంతపురం: జిల్లా పోలీసు ఏఆర్ విభాగంలో పని చేస్తున్న హోంగార్డు పెద్దన్న గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ పి.జగదీష్ సంతాపం వ్యక్తం చేశారు. పెద్దన్న అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అంబేడ్కర్ నగర్‌లో ఉంచిన మృతదేహాన్ని ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, ఆర్ఐ రాముడు, ఆర్ఎస్ఐ జాఫర్ సందర్శించి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని మృతుడి కుటుంబ సభ్యులకు సూచించారు.

జీజీహెచ్‌లో అమానుషం

- హెచ్ఐవీ బాధితురాలిపై వివక్ష
- అపెండిసైటిస్ శస్త్రచికిత్సలో జాప్యం
- జిల్లా అధికార యంత్రాంగానికి ఫిర్యాదు చేసిన అనంత నెట్‌వర్క్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఓ హెచ్ఐవీ బాధితురాలిపై వైద్యులు వివక్ష చూపారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సర్జరీ విభాగానికి సంబంధించి ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షిస్తున్న ఓ వార్డులో ఈనెల 23న ఓ యువతి కడుపు నొప్పితో అడ్మిట్ అయ్యింది. వైద్యులు అపెండిసైటీస్ ఉన్నట్లు నిర్ధారణ చేశారు. చివరకు శస్త్రచికిత్సను జాప్యం చేయడంతో బాధిత కుటుంబీకులు విషయాన్ని అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. చివరకు అక్కడి నుంచి జీజీహెచ్ అధికారులకు చివాట్లు పడటంతో ఎట్టకేలకు ఆ యువతికి సర్జరీ చేసేందుకు వైద్యులు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోజు రోజుకు నాణ్యత ప్రమాణాలు దిగజారిపోతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

ఎంపీఈఓల సర్దుబాటుపై కసరత్తు



ఎంపీఈఓల సర్దుబాటు ప్రక్రియను పరిశీలిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్న 189 ఎంపీఈఓలను సర్దుబాటు చేయడానికి వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ సమక్షంలో ఏడీఏలు, టెక్నికల్ ఏఓలు, సూపరింటెండెంట్లు హాజరై రేషనలైజేషన్ ఆధారంగా... ఇటీవల వీఏఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏల బదిలీలను దృష్టిలో ఉంచుకుని ఎంపీఈఓలను నియమించేందుకు చర్యలు చేపట్టారు. ఏడీఏల ప్రతిపాదనలను పరిగణలోకి ఖాళీగా ఉన్న ఆర్ఎస్‌కేలకు కొందరిని, పంటల విస్తీర్ణం అధికంగా ఉన్న ప్రాంతాలకు మరికొందరిని సర్దుబాటు చేయనున్నారు. సమావేశంలో ఏడీఏలు అల్తాఫ్‌అలీఖాన్, వెంకటరాముడు, సత్యనారాయణ, పద్మజ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరగనుంది. మండలంలో చాలా మేరకు ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు, బిల్లులు సరిగా అందకపోయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో మురుగు, తాగునీటి సమస్యలపై దృష్టి సారించడం లేదు. అధికారులు స్పందించి సమావేశంలో వీటిపై చర్చించి ప్రజలకు పథకాలు అందేలా చేసి గ్రామాల్లో సమస్యలను పరిష్కారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన ఆషాఢమాస ఉత్సవాలు



హారతులు ఇస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని శ్రీసమర్థ గురు అక్కల్ కోట్ మహారాజ్ వటీస్వామి ఆశ్రమంలో గురువారం రాత్రి ఆషాఢమాస ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో కొలువైన కొల్హాపూర్ మహాలక్ష్మి దేవికి ఆకాశ దీపం, ఆకాశ హారతి ఇచ్చేందుకు అధిక సంఖ్యలో మహిళలు తరలి వచ్చారు. అలాగే శాస్త్రోక్తంగా అమావాస్య పూజలు నిర్వహించారు. సామూహిక లలితసహస్రనామ పారాయణం జరిగింది. అనంతరం ఆశ్రమ నిర్వాహకుడు విజయ్‌కుమార్ నేతృత్వంలో తీర్థప్రసాద వితరణ జరిగింది.